ఈనాడు ఒడిశా

22న అండమాన్ వద్ద అల్పపీడనం

● రాష్ట్రానికి పొంచి ఉన్న తుపాను ముప్పు?

గోపాలపూర్, న్యూస్‌టుడే: ఈ నెల 20న ఉత్తర అండమాన్ వద్ద సముద్రంలో ద్రోణి ఏర్పడనుంది. ఇది 22 నాటికి అల్పపీడనంగా మారి బంగాళాఖాతంలో ఉత్తర పశ్చిమ దిశగా ఒడిశాకు చేరువయ్యే సూచనలున్నాయని గోపాలపూర్ వాతావరణ అధ్యయన కేంద్రం ఉమాశంకర్ దాస్ గురువారం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. పీడనం బలం పుంజుకునే సూచనలున్నాయని, 23, 24 తేదీల్లో దీని ప్రభావం రాష్ట్రంపై ఉంటుందన్న అంచనా ఉందన్నారు. ఇది తుపానుగా మారనుందా? అన్నదానిపై ఇప్పుడేమీ చెప్పలేమని, అల్పపీడనం ఏర్పడిన తరువాత స్పష్టత వస్తుందన్నారు. ఇది తుపానుగా మారి ఒడిశాలో తీరం దాటే సూచనలున్నాయని కొన్ని విదేశీ మెట్ సంస్థలు అంచనా వేశాయి. అక్టోబరులో అండమాన్‌లో ఏర్పడే విపత్తులన్నీ రాష్ట్రంపై ప్రభావం చూపిన దాఖలాలున్నాయి. పొంచి ఉన్న విపత్తు తీవ్రత గురించి స్పష్టంగా తెలియకపోయినా వరి పంట పొట్ట దశలో ఉంది. గాలి వీచినా, భారీ వర్షాలు కురిసినా పంటకు నష్టం వాటిల్లే అవకాశం లేకపోలేదు.

గోపాల్‌పూర్‌లో భారీ వర్షం.. గోపాలపూర్‌లో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఇది 6 సెంటీమీటర్లుగా నమోదైనట్లు ఐఎండీ అధికార వర్గాలు తెలిపాయి.

జగన్నాథుని సన్నిధిలో కేంద్రమంత్రి పూజలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: కేంద్ర సామాజిక న్యాయ, సహకార శాఖల సహాయమంత్రి బన్వరీలాల్ వర్మ పూరీ ఎంపీ సంబిత్ పాత్రతో కలిసి గురువారం శ్రీక్షేత్రాన్ని సందర్శించారు. జగన్నాథుని సన్నిధిలో పూజలు చేశారు. అనంతరం సేవాయత్‌లు వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



త్వరలో మహనీయుల విగ్రహాల ఏర్పాటు



సూర్యవంశీ సూరజ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సాంస్కృతిక, ఉన్నత విద్యాశాఖల మంత్రి సూర్యవంశీ సూరజ్ అధ్యక్షతన బుధవారం రాత్రి లోక్‌సేవా భవన్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో దీనిపై నిర్ణయం జరిగింది. సాతంత్ర్య సంగ్రామం, స్వతంత్ర ఒడిశా ఏర్పాటు ఉద్యమంలో పాల్గొన్నవారు, ప్రముఖ కవులు, సాహితీవేత్తల విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. సమావేశానంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ఆయా జిల్లాలు, ప్రాంతాల్లో జన్మించిన మహనీయులను అందరూ నిత్యం స్మరించుకొనేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్ని విగ్రహాలు ఏర్పాటు చేస్తారన్నదానిపై త్వరలో స్పష్టత వస్తుందని, ఈ దిశగా కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేస్తున్నామని తెలిపారు.

నీరందక రైతుల కష్టాలు


● చిన్ననదిలో తాత్కాలిక అడ్డుకట్ట వేసిన ప్రజలు
● మెగా ఎత్తిపోతల పథకం ఉన్నా నిరుపయోగం

నదీ ప్రవాహానికి అడ్డుకట్ట నిర్మాణం



భీంపూర్‌లో ఎత్తిపోతల కార్యాలయం





భీంపూర్ పంచాయతీలో ప్రవహిస్తున్న చిన్న నది

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుణుపురం సమితి భీంపూర్ పంచాయతీలో మెగా ఎత్తిపోతల పథకం ఉన్నా భూములకు నీరందక భూములు బీటలు వారుతున్నాయి. గత ప్రభుత్వం 2015లో భీంపూర్ పంచాయతీ సమీపంలో 21.7 కోట్లతో మెగా ఎత్తిపోతల పథకం పనులు మొదలు పెట్టారు. 2019 సంవత్సరానికి పూర్తి చేశారు. 339.49 హెక్టార్ల భూములకు నీరు అందించాలని లక్ష్యంగా నిర్ణయించగా నీరందక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ఎత్తిపోతల పథకం నుంచి సరిపడా నీరు అందడం లేదు. నది మధ్యలో అడ్డుకట్ట వేస్తే ప్రాజెక్టుకు నీరు అందుతుందని రైతులు జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలో పలు గ్రామాల ప్రజలు ఇసుక బస్తాలు, కర్రలు పాతి అడ్డుకట్ట వేశారు. ప్రస్తుతం 70 శాతం భూములకు నీరందుతుంది. యంత్రాంగం పక్కా నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. ఎత్తిపోతల అధికారులతో ఈ విషయంపై మాట్లాడగా చిన్న నదిపై చెక్‌డ్యాం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామన్నారు.

రెండు ద్వారాల నుంచి భక్తుల ప్రవేశాలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: విశ్వప్రసిద్ధ పూరీ శ్రీక్షేత్రంలో శుక్రవారం నుంచి కార్తిక సేవలు ప్రారంభం కానున్నాయి. 25 రోజులపాటు రాధాదామోదరుని రూపంలో జగన్నాథుడు దర్శనమిస్తాడు. కార్తిక శుక్ల ఏకాదశి నుంచి పౌర్ణమి వరకు పూరీ ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకున్న యంత్రాంగం రెండు ద్వారాల మీదుగా భక్తుల దర్శనాలు చేసుకునేలా ఏర్పాట్లు చేసింది. ఈ నిబంధన శుక్రవారం నుంచి కట్టుదిట్టంగా అమలు కానుంది.



శ్రీక్షేత్రంలో కార్తికం వ్రతాలు


రద్దీ నియంత్రణ ధ్యేయంగా..

భాజపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శ్రీక్షేత్రం నాలుగు ద్వారాలు తెరిపించిన సంగతి తెలిసిందే. సింహ, ఉత్తర, పశ్చిమ, దక్షిణ ద్వారాల మీదుగా భక్తులు రాకపోకలు చేస్తున్నారు. శుక్రవారం నుంచి తూర్పు, పశ్చిమ ద్వారాల మీదుగా ఆలయ ప్రవేశం కల్పిస్తారు. వెలుపలకు మూడు ద్వారాల నుంచి వస్తారు. ఇదివరకు సింహ ద్వారం మీదుగా వెళ్లడానికి, రావడానికి అవకాశం ఉండేది. ఇప్పుడు ఈ ద్వారం నుంచి భక్తుల రాకపోకలకు అనుమతించరు. సేవాయత్‌లు మాత్రం నాలుగు ద్వారాల నుంచీ రాకపోకలు సాగించొచ్చు. కార్తికంలో పురుషోత్తమునికి ప్రత్యేక సేవలు జరుగుతాయి. నిర్ణీత వేళల్లో ఇవి చేపట్టాల్సి ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకున్న యంత్రాంగం సేవాయత్‌లకు వెసులుబాటు కల్పించింది.

నవంబరు 15 వరకు నియమావళి

కార్తిక పౌర్ణమి వరకు నూతన నియమావళి అమల్లో ఉంటుంది. ఆ తరువాత భక్తులు మళ్లీ నాలుగు ద్వారాల మీదుగా రాకపోకలు సాగించగలుగుతారు. శ్రీక్షేత్రంలో వ్రతాలు చేసే హబిషార్థులు రోజుకు రెండు లేక మూడుసార్లు (ఉదయం, సాయంత్రం, రాత్రి మంగళ హారతి వేళల్లో) జగన్నాథ దర్శనం చేస్తారు. ఉదయం నుంచి స్వామి పవళింపు సేవ వరకు ఆలయం కిటకిటలాడుతుంది. ఈ నేపథ్యంలో భక్తులు సహకరించాలని పాలనాధికారి అరవింద పాఢి విన్నవించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నిర్ణీత వేళల్లో స్వామి సేవలు జరిగేలా ఏర్పాట్లు చేశామన్నారు. యంత్రాంగం జారీ చేసిన నియమావళిని ఎవరూ అతిక్రమించరాదన్నారు. మరోవైపు వృద్ధులు, దివ్యాంగులు, మహిళల సహాయార్థం 600 మంది స్వచ్ఛంద సేవా కార్యకర్తలు నియమితులయ్యారు. వీరు భక్తులకు సహకరిస్తారు.

రాజీనామా బాటలో మరికొందరు ఎంపీలు



భువనేశ్వర్, న్యూస్‌టుడే: మరికొందరు బిజద రాజ్యసభ ఎంపీలు రాజీనామా చేయనున్నారని, పార్టీలో అసంతృప్తి తీవ్రంగా ఉందని సీనియర్ నేత **అమర్ ప్రసాద్ శత్పథి** చెప్పారు. గురువారం భువనేశ్వర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిజదకు ఇప్పుడు దిశా నిర్దేశం చేసే నాయకులు లేరని, పరిస్థితి చెయ్యి దాటిందన్నారు. తాను వాస్తవాలు చెప్పిన తరువాత కొంతమంది బిజదలో ఐక్యత లోపించిందని అంగీకరించి మాట్లాడుతున్నారన్నారు. ఇదివరకు ఇద్దరు రాజ్యసభ ఎంపీలు రాజీనామా చేశారని, కొద్దిరోజుల్లో మరికొందరు అదే బాటలో వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బిజద భవిష్యత్తు అనుమానాస్పదంగా ఉందని శత్పథి అన్నారు.

మహాలక్ష్మీ చేతిలో జగన్నాథుని ఓటమి



శ్రీక్షేత్రంలో స్వామి

గోపాలపూర్, న్యూస్‌టుడే: ప్రియసఖి మహాలక్ష్మీ చేతిలో జగన్నాథుడు ఓటమి పాలయ్యాడు. కుమార పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం సాయంత్రం తల్లితో స్వామి జూదం ఆడి సర్వస్వం కోల్పోయి స్వయంగా తానూ తాకట్టు పడతాడు. శ్రీక్షేత్ర సంహిత గ్రంథంలో లక్ష్మి, జగన్నాథుల జూదం గురించి విపులంగా ఉంది. ఈ ముచ్చట సేవాయత్‌లు ఆనవాయితీ ప్రకారం పూరీ శ్రీక్షేత్రంలో నిర్వహించారు. వారం రోజుల వరకు తాకట్టు పడిన స్వామిని లక్ష్మీదేవి తన వద్దనే ఉంచుకుంటుంది. ఈ వేడుక ప్రకారం మహాలక్ష్మి ఉత్సవ విగ్రహాన్ని పురుషోత్తముని సన్నిధికి తెచ్చిన సేవాయత్‌లు పూజలు నిర్వహించారు. జూదం ఆటలు తగదని మానవాళికి తెలియజేయడమే దీని పరమార్థమని, జగన్నాథునికి సంబంధించిన ప్రతీ వేడుకలో తత్వం, రహస్యం ఇమిడి ఉందని పండిత సూర్యనారాయణ రథశర్మ చెప్పారు.



జగన్నాథుని వద్దకు మహాలక్ష్మీని తీసుకెళ్తున్న సేవాయత్‌లు

భద్రక్‌లో తల్లి, కుమార్తె దారుణ హత్య

● కుళ్లిన మృతదేహాలు లభ్యం ● పోలీసుల అదుపులో నిందితులు



నాయకనిధి పోలీస్ స్టేషన్ వద్ద బాధిత కుటుంబం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: మూడు వారాల కిందట తప్పిపోయారనుకున్న తల్లీకుమార్తె దారుణ హత్యకు గురైన ఘటన భద్రక్ జిల్లాలో చోటు చేసుకుంది. బుధవారం వీరి మృతదేహాలు కుళ్లిన స్థితిలో లభ్యం కావడంతో ఇది వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. భద్రక్ జిల్లా నాయకనిధి పోలీస్ స్టేషన్ పరిధి పొంచగురియా గ్రామంలో కాలువ పక్కన కుళ్లిపోయిన ఎముకలతో ఉన్న మృతదేహాలను కుక్కలు పీక్కుతింటుడడం గ్రామస్థులు కొందరు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలు అదే గ్రామానికి చెందిన జమున, ఆమె కుమార్తె కౌసల్య నాయక్‌లువిగా గుర్తించారు. వీరిద్దరూ సెప్టెంబర్ 27న తప్పిపోయినట్లు కౌసల్య భర్త గురుపద్ గెహనా, ఆయన సోదరుడు నిరాపద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జమున, కౌసల్యల హత్యకు వీరిద్దరూ కారణమై ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. హత్య చేసి కేసును తప్పుదోవ పట్టించేందుకు స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చారని సందేహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోదరులిద్దరినీ అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

మాజీ ఎంపీ ప్రభాత్ సామంత్రాయ్ కన్నుమూత



భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంద్రపడ మాజీ ఎంపీ, బిజద నేత ప్రభాత్ సామంత్రాయ్ (78) గురువారం భువనేశ్వర్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. కొన్నాళ్లుగా అస్వస్థతకు గురైన ఆయన చికిత్స పొందుతుండేవారు. 1998లో ఆయన జనతాదళ్ తరపున కేంద్రపడ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. తరువాత బిజదలో చేరారు. ఆయన మృతి పట్ల బిజద అధినేత నవీన్ పట్నాయక్, ఇతర నాయకులు సంతాపం తెలిపారు.

బిజద గమ్యం ఎటువైపు..?

● నవీన్ పరిస్థితి చక్కదిద్ద గలుగుతారా?



భువనేశ్వర్, న్యూస్‌టుడే: బిజద ప్రాంతీయ పార్టీ రాష్ట్రంలో 25 వసంతాలపాటు ఒక వెలుగు వెలిగింది. ఇప్పుడు దాని ప్రభ మసకబారింది. ఎన్నికల్లో పరాజయం తరువాత నేతలు పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు. ప్రసార సాధనాల్లో నిత్యం ఇది చర్చనీయాంశమవుతోంది. కొద్ది రోజుల్లో పంచాయతీ పోరు జరగనుండగా, ఈ వ్యవధిలో అధినేత నవీన్ పట్నాయక్ పరిస్థితి చక్కదిద్దగలుగుతారా? పూర్వ వైభవం కల్పించగలుగుతారా? అన్నదానిపై జోరుగా చర్చ జరుగుతోంది.

అధినేతకు ఫిర్యాదు

బుధవారం నవీన్ జన్మదిన వేడుకలు జరిగిన సంగతి తెలిసిందే. శుభాకాంక్షలు తెలపడానికి నవీన్ నివాస్‌కు వచ్చిన వారిలో కొందరు అధినేతకు ఫిర్యాదు చేశారు. పార్టీలో విభీషణుల సంఖ్య పెరిగిందని, వారిపై చర్యలు తీసుకోకుంటే పంచాయతీ ఎన్నికల్లో పరిస్థితి ప్రతికూలంగా మారుతుందని చెప్పారు. గోతులు తవ్వుతున్నవారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భాజపాతో ఎంతోమంది నేతలు లోపాయికారీ అనుబంధం పెంచుకున్నారని అధినేతకు వివరించారు.

అనుభవజ్ఞులు లేరు

బిజద ఆవిర్భావానికి శ్రమించిన వారు ఆ పార్టీలో ఇప్పుడెవరూ లేరు. అనుభవం కల కొంతమంది భాజపాలో చేరిపోయారు. నవీన్ ఒక్కరే నేత కాగా ఇదివరకటి మాదిరిగా ఆయనను నాయకులు ఖాతరు చేయడం లేదు. అధికారం కోల్పోయిన తర్వాత పరోక్ష విమర్శలు చేస్తున్నారు. బిజద సభా పక్షంలోనూ ఐక్యత కొరవడింది. అన్ని జిల్లాల్లో నేతలు గ్రూపులు కట్టారు. పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో నవీన్ తరచూ అసంతృప్తులను పిలిపించి మాట్లాడుతున్నా ప్రయోజనం కనిపించడం లేదు.

నవంబరులో జిల్లాల పర్యటన

ఇప్పుడు నవీన్‌కు వయసు పైబడింది. మునుపటి ఉత్సాహం లేదు. పరాజయం తరువాత లేని శక్తి కూడదీసుకుని తిరుగుతున్నారు. పార్టీలో క్రమశిక్షణ లోపించిన వైనం ఆయనకు తెలిసినా చర్యలు తీసుకోవడానికి జంకుతున్నారు. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తానొవ్వక, నొప్పించక అన్న చందంగా వ్యవహరిస్తున్నారని పరిశీలకులంటున్నారు. త్వరలో మరి కొందరు బిజదను వీడి భాజపా శిబిరానికి వెళతారన్న వార్తలు షికారు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో నవీన్ నవంబరు నుంచి జిల్లాల్లో పర్యటిస్తారని తెలిసింది. ఇది పార్టీకి లాభిస్తుందని ఆయన విధేయులంటున్నారు.

ఓటమికి ఆమే కారణం



నవీన్‌కు ఫిర్యాదులు చేసిన వారిలో గంజాం జిల్లా కవిసూర్యనగర్ మాజీ శాసనసభ్యురాలు **లతికా ప్రధాన్** విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో బిజద ఘోర పరాజయం వెనుక వెన్నుపోట్లు కారణమన్నారు. అస్కా పార్లమెంటు స్థానానికి పోటీ చేసిన రంజితా సాహు విభీషణ పాత్ర పోషించి భాజపా విజయానికి కారణమయ్యారన్నారు. రంజితాలా నేతలెంతోమంది కమలదళంతో సంబంధాలు కలిగున్నారన్నారు. దీనిపై క్రమశిక్షణ చర్యలు తీసుకొని పక్షంలో ఇలాంటివారి సంఖ్య పెరుగుతుందని, పంచాయతీ ఎన్నికల్లో పార్టీకి తీరని నష్టం జరుగుతుందని అధినేతకు చెప్పామన్నారు.

ఓటర్లు తిరస్కరించారు



దీనిపై **రంజితా సాహు** విలేకరులతో మాట్లాడుతూ తాను విభీషణ పాత్ర పోషించానన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఓటర్లు తిరస్కరించడంతోనే పార్టీ ఓటమిపాలైందన్నారు. అధినేతకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పడానికి వెళ్లిన నేతలు ఫిర్యాదులు చేయడం సిగ్గుచేటన్నారు. బిజదలో అంతా అనుకూలంగా లేదని, నేతల్లో విశ్వసనీయత తగ్గిందన్నారు.

ఆదరణ ఉంది..



బిజద కార్యదర్శి **సంజయ్‌దాస్ వర్మ** బుధవారం రాత్రి భువనేశ్వర్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. నవీన్‌కు ఆదరణ ఉందని, పార్టీలో కొద్దిమంది నేతల్లో అభిప్రాయ భేదాలున్నాయన్నారు. పదవులు ఆశించి కొందరు భాజపాకు దగ్గరవుతున్నారని, తరువాత వారు జీరోలవుతారన్నారు. నవీన్ జిల్లాల్లో పర్యటించిన తరువాత అంతా అనుకూలిస్తుందన్నారు.

నిధుల దుర్వినియోగం.. మాజీ పీఈవో అరెస్టు

బొలంగీర్ జిల్లాలో రూ.89 లక్షలు కాజేసినట్లు ఆరోపణలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: నిధులు దుర్వినియోగం ఆరోపణలపై మాజీ పంచాయతీ విస్తరణాధికారి (పీఈఓ)ని బొలంగీర్ జిల్లా పోలీసులు బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని పుయింతల పోలీస్ స్టేషన్ పరిధి కువేర్‌బహలికి చెందిన రాజ్‌కిషోర్ పొఢా అగల్‌పూర్ సమితి పరిధిలో పీఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. అగల్‌పూర్, భర్సుల పంచాయతీలకు సంబంధించి వివిధ అభివృద్ధి పనులు ఈ ఏడాది మార్చిలో చేశారు. వాటికి ఆయన ప్రభుత్వ నిధులను వెచ్చించారు. సాధారణ తనిఖీకి వెళ్లిన సమితి అభివృద్ధి అధికారి కుల్దీప్ మహంతి ఆ పనులకు సంబంధించి ప్రాజెక్టు వివరాలను అడిగారు. సంబంధిత దస్త్రాలను ఇవ్వకపోవడంతో రాజ్‌కిషోర్‌ను విధుల నుంచి తొలగించారు. ఆ తరువాత విధుల్లో చేరిన పీఈవోకి బాధ్యతలు అప్పగించేందుకు రాజ్‌కిషోర్ నిరాకరించారు. తదుపరి విచారణకు సమితి కార్యాలయానికి హాజరు కావాల్సిందిగా ఏప్రిల్‌లో సమన్లు పంపినప్పటికీ హాజరు కాకపోవడంతో ఆయనపై బీడీవో మహంతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.89 లక్షల వరకు ప్రభుత్వ నిధులను రాజ్‌కిషోర్ దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని, విచారణ కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు.

గ్రామంపై ఇంత నిర్లక్ష్యమా?



రహదారి దుస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పవిత్ర చౌలా కాంతి

సిమిలిగుడ, న్యూస్‌టుడే

నియోజకవర్గం పరిధిలో దశమంత్‌పూర్ సమితికి చెందిన కాంతి గ్రామంపై అధికారులు నిర్లక్ష్యం చూపడంతో లక్ష్మీపూర్ ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఈ ప్రాంతంలో పర్యటించారు. అతి దారుణంగా ఉన్న రహదారిని చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. బురదతో కూడిన మార్గంపై గిరిజనులు ఎలా రాకపోకలు సాగిస్తారని, పారిశుద్ధ్యం నిర్వహణ కొరవడిందన్నారు. ఈ సందర్భంగా స్థానికులు అక్కడ ఉన్న సమస్యలు ఎమ్మెల్యేకు వివరించారు. ఇప్పటి వరకు ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామంలో పర్యటించడం లేదన్నారు. మంచినీరు, విద్యుత్తు సమస్యలపై యంత్రాంగం చొరవ తీసుకోవడం లేదని. ప్రభుత్వ పథకాలకు దూరమయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థుల గోడు విన్న ఎమ్మెల్యే అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సమితి అభివృద్ధి అధికారికి ఫోన్ చేసి నిలదీశారు. ఈ గ్రామంపై ప్రత్యేక దృష్టి నిలిపి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. దీనిపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే పవిత్ర పేర్కొన్నారు. ఆయనతో ఎంపీ ప్రతినిధి కైలాష్ కోసల, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.



నిరుపేద ఇంటిని చూస్తూ...

కోలాహలంగా 'మా కాళువా యాత్ర' ముగింపు



పల్లకిలో నిజ మందిరానికి బయలుదేరిన మా కాళువా



కిటకిటలాడుతున్న గుసానినువాగాం ప్రాంతం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గుసానినువాగాంలోని సుప్రసిద్ధ 'మా కాళువా' యాత్ర గురువారం కోలాహలంగా ముగిసింది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుసానినువాగాం పెద్దవీధిలోని తాత్కాలిక మందిరం నుంచి భక్తులు వెంటరాగా పల్లకిలో అమ్మవారు నిజ మందిరానికి బయలుదేరింది. వివిధ వీధుల్లో సాగిన యాత్రలో అడుగడుగునా మహిళలు మంగళహారతులు పట్టి, నైవేద్యాలు సమర్పించారు. గురువారం మధ్యాహ్నం మా కాళువా శివారులోని నిజ మందిరానికి చేరుకుంది. బ్రహ్మపురతోపాటు చుట్టుపక్కల నుంచి వేలల్లో తరలివచ్చిన భక్తులతో గుసానినువాగాం, పరిసర ప్రాంతాలు రద్దీగా మారాయి. బ్రహ్మపుర పోలీసు జిల్లా యంత్రాంగం ముగింపు యాత్రకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేపట్టింది.

గజలక్ష్మి నమోనమః

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలో వరుస పూజలతో పట్టణాలు, నగరాలు కళకళలాడుతున్నాయి. వినాయకచవితి నుంచి అంతటా పండగ వాతావరణం నెలకొంది. విశ్వకర్మ పూజలు, దేవీ శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తాజాగా బుధవారం రాత్రి నుంచి జిల్లావ్యాప్తంగా గజలక్ష్మీ పూజలు ప్రారంభమయ్యాయి. కొన్నిచోట్ల ఐదు రోజులు, మరికొన్ని ప్రాంతాల్లో ఏడు రోజులపాటు పూజలు చేస్తున్నారు. బ్రహ్మపురలోని గుసానినువాగాం, తళొమెంటు కూడలి తదితర ప్రాంతాల్లోని తాత్కాలిక మండపాల్లో గజలక్ష్మీకి విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు.

ఛత్రపురంలోని లోయర్ బస్టాండు వద్ద ఏర్పాటైన గజలక్ష్మీ పూజా మండపం



బ్రహ్మపుర గుసానినువాగాంలో అందమైన ఆర్చీల మధ్య గజలక్ష్మీ తాత్కాలిక పూజా మండపం




(c) eenadu

గజలక్ష్మీనమోస్తుతే

గుణుపురం, రాయగడ, సిమిలిగుడ, ఖరగ్‌పూర్, కొరాపుట్ పలు ప్రాంతాల్లో మండపాలు వద్ద ప్రతిష్ఠించిన గజలక్ష్మి అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పర్లాఖెముండిలో గత 40 ఏళ్లుగా ఈ పూజలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



రాయగడ న్యూకాలనీలో ఏర్పాటు చేసిన మండపం


పర్లాఖెముండి ఒడియా మంగళ వీధి ప్రాంగణంలో..


ఖరగ్‌పూర్: బెంగాలీల ఇళ్లలో లక్ష్మీ పూజ


గుణుపురం శేఖర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన గజలక్ష్మి విగ్రహం


కొరాపుట్: కళానికేతన్ వద్ద గజలక్ష్మి


సిమిలిగుడ గాంధీనగర్‌లో ..

హాబిషార్థుల అసంతృప్తి


బృందావతి నివాస్ వద్ద మహిళలు

గోపాల్‌పూర్, న్యూస్‌టుడే: పూరీలోని బృందావతి నివాస్ వద్ద హాబిషార్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక్కడ బైరాయింపు చేసిన వారంతా తమను లోపలికి అనుమతించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం నుంచి శ్రీక్షేత్రంలో కార్తిక వ్రతాలు ప్రారంభం కానుండగా, గురువారం నయాగఢ్‌కు చెందిన మహిళలు బృందావతి నివాస్‌కు వచ్చారు. వారిని అధికారులు లోపలికి అనుమతించలేదు. వారు ముందుగా తమ వివరాలు నమోదు చేసుకోకపోవడంతో అడ్డుకున్నారు. తొలుత గుర్తింపు పత్రాలున్న వారికే వసతి కల్పిస్తామని తెలిపారు. దీంతో మహిళలు అసంతృప్తి వ్యక్తం చేశారు. తరువాత పాలనాధికారి సిద్ధార్థ్ శంకర్ స్వయిన్ జోక్యంతో పరిస్థితి చక్కబడింది. ముందుగా కొందరు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఉచిత వసతి, తీర్థ ప్రసాదాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆయన చెప్పారు. 2,500 మంది వీరిలో ఉన్నారన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా వచ్చిన వారికి సిబ్బంది నిరాకరించారన్నారు. అప్పటికే గుర్తింపు పత్రాలతో వచ్చిన వారికి తొలుత ఆశ్రయం కల్పించి, మిగతా వారికి తరువాత న్యాయం చేస్తామన్నారు. బృందావతి నివాస్‌తోపాటు మున్సిపల్ కల్యాణ మండపం, నీలాద్రి భక్త నివాస్, యాత్రి నివాస్‌లో ఆశ్రయం కల్పిస్తున్నామన్నారు.

కన్నుల పండువగా ద్వాదశ పౌర్ణమి వ్రతం


కలశ యాత్రలో పాల్గొన్న మహిళలు

రాయగడ, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రధాన తపాలా కార్యాలయం సమీపంలో ఉన్న సంతోషిమాత ఆలయంలో ద్వాదశ పౌర్ణమి వ్రత దీక్ష పరిసమాప్తి కార్యక్రమాలు కన్నుల పండువగా జరిగాయి. గురువారం ఉదయం 108 మంది మహిళలు నది జలాలను కోలాయి(కలశం)లో తీసుకొని వచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. వినాయక, వాస్తు, నవగ్రహ పూజలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. శాంతి హోమం జరిగింది. ప్రసాద సేవనం నిర్వహించారు. ఏడాదిలో 12 పౌర్ణములు వ్రత దీక్ష చేసి, పరిసమాప్తి చేసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర నటరాజశర్మ తెలిపారు. ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు కోరాడ సీతారామస్వామి, డైలీ మార్కెట్ వ్యాపారులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నందన్న ఉత్సవాలు ప్రారంభం


కొత్త కెరండి గ్రామంలో పూజలు అందుకుంటున్న నందన్న

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నందన్న పూజలు ప్రారంభమయ్యాయి. మేళతాళాలతో నందన్నను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆయా మండపాల్లో ప్రతిష్ఠిస్తున్నారు. ఐదు నుంచి తొమ్మిది రోజుల పాటు పూజలు నిర్వహిస్తామని భక్తులు తెలిపారు.

జీవిత బీమా సంస్థ కొత్త భవనం ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎల్ఐసీ సీఈఓ, ఎండీ సిద్ధార్థ మహంతి. చిత్రంలో ఇతర అధికారులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: స్థానిక ఇంజినీరింగు స్కూలు కూడలిలోని రైలు పైవంతెన సమీపాన జీవిత బీమా సంస్థ నూతన భవనాన్ని బుధవారం ప్రారంభమయ్యింది. ఎల్ఐసీ సీఈఓ, ఎండీ సిద్ధార్థ మహంతి బ్రాంచి కార్యాలయం-1, కెరీర్ ఏజెంట్స్ బ్రాంచ్ (సీఏబీ) భవనాన్ని రిబ్బను కత్తిరించి, జ్యోతి వెలిగించి ప్రారంభించారు. జోనల్ మేనేజరు (ఈసీజెడ్, పట్నా) శ్రవణ్‌కుమార్, ఈడీ (ఇంజినీరింగు) బీబీ.జాదవ్, ముఖ్య ఇంజినీరు ఎల్ఐసీ ఈసీజెడ్ పీకేజే డుంగ్‌డుంగ్, ఎల్ఐసీ బ్రహ్మపుర ఎస్‌డీఎం ఎస్.కె.పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.

బాక్సైట్ తవ్వకాలు జరగనివ్వం


ప్రసంగిస్తున్న రబి సేరు బంధు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: పొట్టంగి సమితిలో సేరు బంధు పర్వతంపై బాక్సైట్ తవ్వకాలను గిరిజనులు వ్యతిరేకించారు. నాల్కో ద్వారా బాక్సైట్ తవ్వకాలకు ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో మాలి పుట్ పంచాయతీకి చెందిన మార్కర్ బంద్ గ్రామంలో గురువారం గిరిజనుల సమావేశం నిర్వహించారు. సేరు బంధు సురక్షా సమితి అధ్యక్షుడు రబికోరా అధ్యక్షతన సభ్యులు రంజిత్‌పంగి, సాధుగుంట, కొరాపుట్ జనసురక్ష సంఘం అధ్యక్షుడు దాసినంది వాలి, కార్యదర్శి మంగుడు జానీ, జిల్లాపరిషత్ సభ్యురాలు తికాయి గమెల్ తదితరులు పాల్గొన్నారు. సేరుబంధు పర్వతాన్ని గిరిజనులు పరిరక్షించుకునే విధంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

రహదారి ప్రమాదంలో యువకుడి దుర్మరణం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన నందపూర్ సమితిలో జరిగింది. పాడువా ఠాణా అధికారి అశోక్‌కుమార్ బిసోయి అందించిన వివరాల ప్రకారం.. సదరు ప్రాంతానికి చెందిన షేక్ హుస్సేన్(24) బుధవారం సాయంత్రం స్కూటీపై చటువా గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా దర్లిపుట్ వద్ద వాహనం అదుపుతప్పిపోయింది. కింద పడిన హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవపరీక్షకు తరలించారు.

గుండెపోటుతో రైల్లోనే ప్రయాణికుడి మృతి

కలకరెట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: రైలులో వెళ్తున్న ప్రయాణికుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన పార్వతీపురంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు వివరాల మేరకు.. రాయగడకు చెందిన బి.సన్యాసిరావు (57) విజయనగరం వెళ్లేందుకు సూరత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేస్తున్నారు. ఒడిశాలోని లక్ష్మీపూర్ రైల్వే స్టేషన్ వచ్చే సరికి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే రైలులోని ఆర్పీఎఫ్ సిబ్బందికి తెలియజేశారు. వారు బెలగాం పోలీసులకు సమాచారం అందించారు.. అత్యవసర వాహనాన్ని రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లారు. రైలు వచ్చిన వెంటనే ప్రయాణికుడిని దించారు.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య సూర్యప్రభ నుంచి జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు వాగ్మూలం సేకరించారు.

వ్యాన్ ఢీకొని నలుగురికి గాయాలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: వ్యాన్ ఢీకొని నలుగురు గాయపడిన ఘటన ఖరగ్‌పూర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖరగ్‌పూర్ సబ్ డివిజన్ పరిధిలో నారాయణగఢ్ బైపాస్ మీదుగా మిద్నాపూర్ వెళ్తున్న కారును ఖరగ్‌పూర్ పయనిస్తున్న ఒక వ్యాన్ వెనుక నుండి వచ్చి బలంగా ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒక శిశువుతో పాటు మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు బెల్దా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్చారు. వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

భారీగా గంజాయి లభ్యం

జయపురం, న్యూస్‌టుడే: జయపురంలో బుధవారం రాత్రి పోలీసులు జరిపిన సోదాల్లో భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ ఈశ్వర్ తాండి తెలిపిన వివరాల ప్రకారం పోలీసులు రాత్రి జాతీయ రహదారి-26పై తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో బొయిపరిగుడ నుంచి అతి వేగంగా వెళ్తున్న ట్రక్కును పోలీసులు గుర్తించారు. ఇది గమనించిన వాహన చోదకుడు కొంత దూరంలో ట్రక్కును ఆపేసి అటవీ మార్గంలోకి వెళ్లిపోయాడు. పోలీసులు అనుమానంతో వాహనంలో సోదాలు చేయగా 36 గంజాయి బస్తాలు లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకున్నారు. బస్తాల్లో 1,123 కిలోల గంజాయి ఉంటుందని వీటి విలువ రూ.ఒక కోటి 12 లక్షలు ఉండవచ్చని అంచనా వేశారు. నిందితుడిని త్వరలో పట్టుకుంటామన్నారు.

పద్మపురంలో గంజాయిపై నిఘా

గుణుపురం, న్యూస్‌టుడే: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే రాయగడ జిల్లా పద్మపురం సమితి అంబొకొలా గ్రామంలో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారని సమాచారంతో పోలీసులు నిఘా పెట్టారు. ఈ తనిఖీల్లో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 192 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

జూదరుల అరెస్టు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లాలో జూద శిబిరంపై పోలీసులు దాడి చేసి అయిదుగురిని అరెస్టు చేశారు. ఠాణాధికారి సుబ్రంత్ పండా తెలిపిన వివరాల ప్రకారం మోహన సమితి అడవా ఠాణా పరిధిలో రయిపోంకా గ్రామంలో ఓ ఇంట్లో జూదం ఆడుతున్నారనే సమాచారంతో దాడులు చేశామన్నారు. ఈ సోదాల్లో అయిదుగురి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10 వేల నగదుతో పాటు 6 ద్విచక్రవాహనాలు, 3 చరవాణిలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి గురువారం కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

● బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం పోలీసు జిల్లా అస్కా, రంభ, హింజిలి ఠాణాల పరిధుల్లోని వివిధ చోట్ల జూద శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. 23 మంది జూదరుల్ని అదుపులోకి తీసుకుని, రూ.1,00,590ల నగదు, చరవాణులు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లాలో వరుసగా జరుగుతున్న చోరీ కేసులను కొరాపుట్ పోలీసులు ఛేదించారు. ఈ వివరాలను విలేకర్ల సమావేశంలో ఎస్పీ శ్రీకాంత్ బెహరా తెలిపారు. ఇటీవల అక్టోబర్ 15న కటక్ నుంచి పుంజిసిల్ పర్యటన కేంద్రానికి ప్రణబ్ ఆనం వచ్చారు. గుర్తుతెలియని వ్యక్తులు వారి కారు అద్దాలు పగలగొట్టి ఒక లేడి హ్యాండ్ బ్యాగ్‌లో నగదు రూ.2000, ఒక ట్యాబ్, రెండు చరవాణిలు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ప్రత్యేక బృందం ఇన్‌స్పెక్టర్ ఆర్.కె.మాఝి, ఐఐసీ రూనుల ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి ముగ్గుర్ని అరెస్టు చేశారు. నిందితులు గత వారం రోజులగా దొంగతనాలకు పాల్పడుతున్నారని చెప్పారు. వారి వద్ద నుంచి రూ.3,500 నగదు, 3 చరవాణిలు, లేడీ హ్యాండ్ బ్యాగ్ స్వాధీనం చేసుకున్నారు.

దొంగతనానికి పాల్పడి చిక్కిన మహిళలు

కాశీనగర్, న్యూస్‌టుడే: గజపతి జిల్లా గుసాని సమతిలో గల సెంచూరియన్ విశ్వవిద్యాలయం 4వ గేటు ఎదురుగా ఉన్న ఇంట్లో గురువారం చోరీ జరిగింది. గురండి ఠాణా ఓఐసీ రవీంద్ర పాత్రో తెలిపిన వివరాల మేరకు.. విశ్వవిద్యాలయం 4వ గేటు ఎదురుగా ఉన్న ఓ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇద్దరు మహిళలు చంటి బిడ్డతో ఆ ఇంట్లోకి ప్రవేశించి దొంగతనానికి ప్రయత్నించారు. చోరీకి తెచ్చుకున్న ఉలి, ఇనుప రాడ్లతో తలుపులు పగలుగొడుతుండగా శబ్దాలు విని చుట్టు పక్కల వారు అక్కడికి చేరుకున్నారు. ఇంతలో ఆ సామగ్రిని పొదల్లోకి పారేశారు. వారిని స్థానికులు అదుపులోకి తీసుకున్నారు. కాశీనగర్ పట్టణంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన చోరీలో వీరి ప్రమేయం ఉంటుదని అనుమానంతో ప్రాంతవాసులు పోలీసులకు సమాచారం అందించారు.

సారా స్వాధీనం

జయపురం, న్యూస్‌టుడే: అక్రమంగా సారా రవాణా చేస్తున్న ఇద్దరిని అబ్కారీశాఖ అరెస్టు చేశారు. అబ్కారీ ఇన్‌స్పెక్టర్ శశికాంత్ దత్తా తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్, అబ్కారీ శాఖ సంయుక్తంగా వివిధ చోట్ల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇద్దరు వ్యక్తులు పట్టణంలో అక్రమంగా సారా విక్రయించేందుకు తీసుకెళ్తూ అధికారులకు చిక్కారు. నిందితులు పాలిగూడ ప్రాంతానికి చెందిన కృష్ణ ఖరా, నీలగూడకు చెందిన అభిహిమల్‌గా గుర్తించారు. వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జామీను మంజూరు కాకపోవడంతో కారాగారానికి తరలించారు. వారి దగ్గర నుంచి రెండు ద్విచక్రవాహనాలు, రెండు చరవాణిలు, దాదాపు 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.

అడవిలో గుర్తు తెలియని వ్యక్తి కుళ్లిన మృతదేహం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కళ్లికోట ఠాణా పరిధిలో గోపపూర్ అటవీ ప్రాంతంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి కుళ్లిన మృతదేహం వెలుగులోకి వచ్చింది. ఉదయం అడవిలో కట్టెల కోసం వెళుతున్న కొందరు మహిళలు మృతదేహాన్ని గమనించారు. సమాచారం అందుకున్న పోలీసులు అటవీ ప్రాంతానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. సమీపంలో వన్యప్రాణుల్ని వేటాడేందుకు ఉపయోగించే విద్యుత్తు తీగలు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. బహుశా రెండు, మూడు రోజుల కిందట వన్యప్రాణుల్ని వేటాడేందుకు అమర్చిన విద్యుత్తు తీగలు తగిలిన వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతిచెందిన వ్యక్తి ఎవరనే విషయమై అటవీ ప్రాంతం సమీప గ్రామాల్లో ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని పరీక్షల కోసం తరలించి కేసు నమోదు చేశారు.

కార్తిక పూజలు జరిగేనా..?


జగన్నాథ్ సాగరం వద్ద నెలకొన్న పరిస్థితి

జయపురం, న్యూస్‌టుడే: ఒడియా సంప్రదాయ పద్ధతిలో శుక్రవారం నుంచి కార్తిక మాసం ప్రారంభం కానుంది. ఈ మాసంలో మహిళలు నదీ స్నానాలు చేసి, అక్కడే తులసికోట పూజలు నిర్వహిస్తారు. జయపురం పట్టణంలో ఉన్న చారిత్రాత్మకమైన జగన్నాథ్, ఖజూరిబంద్, నీలకంఠ సాగరాల పూడికతీత పనులు జరుగుతున్నాయి. దీంతో పాటు వ్యర్థాలు కూడా దర్శనమివ్వడంతో స్థానిక మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఈవో సిద్ధార్థ్ పట్నాయక్‌ను 'న్యూస్‌టుడే' అడగ్గా వెంటనే పారిశుద్ధ్య కార్మికులచే శుభ్రం చేయిస్తామని తెలిపారు.

స్వచ్ఛత పక్షోత్సవం


స్టేషన్ పరిసరాలు శుభ్రం చేస్తు న్న పారిశుద్ధ్య కార్మికులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: మండలంలో ఉన్న అన్ని రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతా పక్షోత్సవం నిర్వహించినట్లు మండలం అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్, ఫ్లాట్ ఫాం పరిసర ప్రాంతాలు, ఇతర కార్యాలయాలు, శౌచాలయాలు, నీళ్ల ట్యాంకులు శుభ్రం చేశారు. అధికారులు ఆహార స్టాల్స్‌లో పరిశుభ్రత, ఆహార నాణ్యత, ధర, పరిమాణం తదితర అంశాలపై తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

నకిలీ ఐస్‌క్రీం పరిశ్రమ సీజ్


పట్టుబడిన సామగ్రి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రవుర్కెలా పోలీసులు గురువారం మధ్యాహ్నం నగరంలోకి నకిలీ ఐస్‌క్రీం పరిశ్రమపై దాడి చేసి కల్తీ సామగ్రి స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఆరుగుర్ని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మునిగిన పడవ.. తప్పిన ముప్పు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బాలేశ్వర్ జిల్లా బాలేశ్వర్ సమితిలోని తత్సారీ తీర గ్రామానికి చెందిన ఆరుగురు సముద్రంలో మృత్యుముఖం నుంచి బయటపడి ఒడ్డుకు చేరారు. గురువారం ఉదయం చేపల వేటకు వెళ్లిన వారి మర పడవకు మరో పడవ తగలడంతో మునిగిపోయింది. ఈ ఘటనలో మునిపోయిన పడవలో ఉన్న ఆరుగురు ప్రమాదానికి కారణమైన పడవలోకి చేరి దిఘా తీరం చేరారు. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. దిఘా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స జరిగింది.

ఆశ్రమం అభివృద్ధికి కృషి


వాల్మీకి ఆశ్రమం ప్రాంతంలో సందర్శించిన ఎమ్మెల్యే కడం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: వాల్మీకి ఆశ్రమం అభివృద్ధికి కృషి చేస్తానని పొట్టంగి ఎమ్మెల్యే రామచంద్ర కడం హామీ ఇచ్చారు. నందపూర్ సమితి పంతులుంగ్ గ్రామ పంచాయతీ పరిధి ముక్తియంబ గ్రామంలోని ఆశ్రమంలో వాల్మీకి జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కడం పాల్గొని మాట్లాడారు. ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న వాల్మీకి ఆశ్రమం అభివృద్ధికి దృష్టి సారిస్తానన్నారు. ప్రముఖ రాజా గుహలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతానని అన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కామేష్ కముడి, నందపూర్ పర్యాటక వికాస్ పరిషత్ అధ్యక్షుడు జగన్నాథ పంగి, వాల్మీకి ఆశ్రమం కమిటీ అధ్యక్షుడు నీలకంఠ డోలియ, నేతలు అర్జున్ బంక, శుక్ర కోరా, సర్పంచి పీతాంబర్ కొర్మని తదితరులు ఉన్నారు.

నవీన్ చేతుల మీదుగా పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నవీన్ పట్నాయక్

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా సిమిలిగుడకు చెందిన రుచిక దివ్యదర్శిని రచించిన పుస్తకాన్ని బిజద పార్టీ సుప్రీమ్, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆవిష్కరించారు. భువనేశ్వర్‌లో నవీన్ నివాసంలో మంగళవారం రాత్రి జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రుచిక రచించిన నాలుగో పుస్తకం 'గ్లాన్స్ ఆఫ్ రేడియన్స్'' పుస్తకాన్ని నవీన్ ఆవిష్కరించి అభినందించారు. ఇప్పటి వరకు ఈమె మూడు పుస్తకాలు రచించింది. 2021లో మొదటిది, 2022లో రెండో పుస్తకాన్ని అప్పటి గవర్నర్ గణేశీలాల్ ఆవిష్కరించారు. 2023లో 3వ పుస్తకాన్ని అప్పటి కలెక్టర్ మహమ్మద్ అబ్దుల్ అక్తర్‌ల ఆవిష్కరించారు. ఈమెకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో సాహిత్య రంగంలో అనేక అవార్డులు లభించాయి.

నూతన బస్సు స్టాండ్ ప్రారంభం


బస్సు స్టాండ్ ప్రారంభిస్తున్న సర్పంచి


రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కల్యాణసింగుపూర్ సమితి సునాకండి పంచాయతీ జగన్నాథపూర్ గ్రామంలో ప్రయాణికుల సౌకర్యార్థం రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన బస్సుస్టాండ్‌ను సర్పంచి సంజీవ్ నిసిక ప్రారంభించారు. దీంతో ప్రయాణికుల అవస్థలు తీరుతాయని సమితి సభ్యుడు సోంబురు కులిసిక తెలిపారు. వార్డు సభ్యులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రియాశీలక సభ్యత్వ నమోదు


మాట్లాడుతున్న మంత్రి నిత్యానంద గోండ్

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నిత్యానంద గోండ్ రాయగడ జిల్లా పర్యటన ముగించుకొని బుధవారం రాత్రి పర్లాఖెముండిలోని సర్క్యూట్ భవన్‌కి చేరుకున్నారు. ఆయనకు నాయకులు ఘన స్వాగతం పలికారు. గురువారం గుసాని సమితి మచ్చుమూర పంచాయతీ రాజపురం గ్రామంలోని అన్నపూర్ణ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరితో సభ్యత్వాలు నమోదు చేయించుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి వివరించారు. మహిళ ఆర్థిక అభివృద్ధికి సుభద్ర పథకం అని గుర్తుచేశారు. నాయకులు గేదెల శ్రీధర్ నాయుడు, బల్ల ధనుంజయులు, జగన్నాథ్ పరిడా, జగన్నాథ్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

కొంధమాల్‌లో డీజీపీ సమీక్ష


ఫుల్బాణీలో అధికారులతో సమీక్షిస్తున్న పోలీసు డీజీ ఖురానియా

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: మావోయిస్టు సమస్య, గంజాయి సాగు సమూల నిర్మూలన లక్ష్యంగా అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా ఆదేశించారు. మావోయిస్టు ప్రభావిత కొంధమాల్ జిల్లాలో ఆయన రెండు రోజులు పర్యటించారు. గురువారం జిల్లా కేంద్రం ఫుల్బాణీలోని ఎస్పీ కార్యాలయంలో పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఐజీ (ఆపరేషన్స్) జయనారాయణ పంకజ్, ఎస్‌డబ్ల్యూ డీఐజీ కన్వర్ విశాల్ సింగ్, దక్షిణ మండల డీఐజీ సార్థక్ షడంగి, కొంధమాల్, బౌద్ధ్, కలహండి జిల్లాల ఎస్పీలు పాల్గొన్నారు. అనంతరం డీజీపీ ఖురానియా కొంధమాల్ జిల్లాలోని పలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించడంతోపాటు సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్ క్యాంపులు సందర్శించి అధికారులతో మాట్లాడారు. మావోయిస్టు సమస్యతోపాటు గంజాయి సాగు నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై వారితో మాట్లాడారు. అంతకుముందు బుధవారం పోలీసు రిజర్వు కార్యాలయం చేరుకున్న డీజీపీ ఖురానియా అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. తర్వాత ఆయన బలిగుడ, ఫిరింగియా ఠాణాల పరిధుల్లోని వివిధ చోట్ల పర్యటించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

నిర్వాసితులను ఆదుకోవాలి


సమావేశంలో నిర్వాసితుల ప్రతినిధులు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కాశీపూర్ సమితి కొంశారిగూడలో ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన అల్యూమినియం పరిశ్రమ నిర్మాణంతో భూములు కోల్పోయిన నిర్వాసితులను కంపెనీ అన్నివిధాలా ఆదుకోవాలని పలువురు కోరారు. ఈ మేరకు గురువారం సాయంత్రం టికిరిలో నిర్వాసితుల ప్రతినిధులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. నిర్వాసిత ప్రతినిధి సుమాంత సామంగి మాట్లాడుతూ 2006 నుంచి ఈ ప్రాంతంలో నివాసముంటున్నామని 2010లో ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో తమ భూములకు సంబంధించి ఎలాంటి వివరాలు లేవని వివరించారు. భూములిచ్చిన వారందరికి పూర్తి పరిహారంతో పాటు కంపెనీలో ఉద్యోగం కల్పించాలని కోరారు. ఈ విషయమై ముఖ్యమంత్రికి, రెవెన్యూశాఖ మంత్రికి, దక్షిణ మండల ఆర్డీసీకి, జిల్లా పాలనాధికారికి వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు. సుశాంత సామంగి, లంబొదర పండా, గంగాధర సేనాపతి, పవిత్ర కర, ముక్తికాంత బెహరా తదితరులు పాల్గొన్నారు.

పశుసంపద మేళాపై సన్నాహక సమావేశం


మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి బిజయ్‌కుమార్, తదితరులు

కాశీనగర్, న్యూస్‌టుడే: పాలనాధికారి బిజయ్‌కుమార్ దాస్ అధ్యక్షతన కలెక్టర్ భవనంలో మత్స్య, పశు సంపద మేళాపై సమావేశం జరిగింది. గజపతి క్రీడా మైదానంలో వచ్చే నెల 8, 9 తేదీల్లో జరిగే పశు మేళా రైతులకు ఆకర్షించేలా ఉండాలని, ప్రతిరోజు 500 మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను పాలనాధికారి ఆదేశించారు. జిల్లా పరిషత్ ముఖ్య అభివృద్ధి అధికారి గుణనిధి నాయక్, వ్యవసాయాధికారి సురేంద్రనాథ్ స్వైయిన్, మత్స్య అధికారి లిసా బెహరా, ఉద్యాన విభాగ ఉప సంచాలకుడు సుశాంత్‌కుమార్ ఉన్నారు.

(c) eenadu

కుళాయి నీరు ఇంకెప్పుడు?

జల్‌జీవన్ మిషన్ లక్ష్యానికి తూట్లు

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే



గురుదాసుపురంలో నీరు రాని కుళాయిలు

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు తీర్చడానికి ఇంటింటికీ కుళాయి నీరందించేందుకు ఉద్దేశించిన జల్‌జీవన్ మిషన్ లక్ష్యం నెరవేరడం లేదు. గత ప్రభుత్వ నిర్వాకంతో గుత్తేదారులకు బిల్లులు మంజూరు కాక పెద్దఎత్తున బకాయిలు పేరుకు పోయాయి. పలాస మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన పనుల్లో వేగం కనిపించడం లేదు. పలు చోట్ల మధ్యలోనే నిలిచిపోగా.. మరికొన్ని గ్రామాల్లో మొదలు కాలేదు. ఫలితంగా పల్లె ప్రజలకు తాగునీటి అవస్థలు తప్పడం లేదు.

● గ్రామాల్లో రక్షిత నీటి పథకాల నిర్మాణం, పైపులైన్లు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయాలనేది జల్‌జీవన్ మిషన్ ఉద్దేశం. పలాస మండలంలోని 19 పంచాయతీల్లో అరకొర పనులు చేయడంతో కుళాయిల ద్వారా ఇళ్లకు నీరు అందడం లేదు. ఇప్పటివరకు 40 నుంచి 50 శాతం పనులు పూర్తికాని పరిస్థితి. తొలి విడతలో 59 పనులు మంజూరయ్యాయి. సుమారు రూ.9 కోట్లు విడుదల కాగా 53 పనులు జరిగాయి. మూడు పనులకు టెండర్లు పిలవలేదు. రెండో విడతలో 75 పనులకు రూ.25 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు.

ఇదీ పరిస్థితి

వైకాపా ప్రభుత్వం రాష్ట్ర వాటా కింద ఇవ్వాల్సిన 50 శాతం నిధులు ఇవ్వకపోవడంతో పలు చోట్ల ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలు నిలిచిపోయినట్లు సమాచారం. అవి పూర్తయితే గ్రామాల్లో తాగునీటి సమస్య తీరుతుందని భావించిన ప్రజలకు నిరాశే మిగిలింది. పలాస మండలంలో గురుదాసుపురం, మామిడిమెట్టు, మాకన్నపల్లి, పెదంచల తదితర పంచాయతీల్లో పైపులు వేసినా నీరు రావడం లేదు. మరికొన్ని పంచాయతీల్లో పనులు సగంలోనే ఉన్నాయి. ఇంకొన్ని చోట్ల ఇంకా ప్రారంభించలేదు.

పనులు చేపడతాం..

జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టాల్సిన పనులను సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం. పలు గ్రామాల్లో ఇంకా కొనసాగుతున్నాయి. త్వరలోనే వాటిని పూర్తి చేసి తాగునీటి అవస్థలు లేకుండా చూస్తాం. **- ధనుంజయ, ఏఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పలాస**

గంజాయి రవాణా కట్టడికి పకడ్బందీ చర్యలు: ఎస్పీ

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో గంజాయి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ హెచ్చరించారు. జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి రవాణా, హష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మనూరు మండలం డొవ్వూరు కూడలి వద్ద టీఎస్-న్యాబ్ పోలీసులు, మనూరు ఎస్సై, సిబ్బంది వాహనాలు తనిఖీ చేయగా, కారు డిక్కీలో 40 కిలోల ఎండు గంజాయి లభించింది. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, బీదర్ జిల్లా బసవేశ్వర్ చౌక్‌కు చెందిన మల్లగొండగా తేలింది. అతను చోరీ కేసుల్లో బీదర్ జిల్లాలో జైలుకు వెళ్లాడు. ఆ సమయంలో ఒడిశాకు చెందిన రాహుల్ చక్రవర్తి, బాల్కికి చెందిన మల్లేశ్ యాదవ్, మహారాష్ట్రకు చెందిన దాదాపాటిల్‌తో ఇరువురికి పరిచయం ఏర్పడింది. ఇరువురు జైలు నుంచి ఇటీవల బయటకు వచ్చారు. సెప్టెంబరులో జహీరాబాద్ సమీపంలోని చిరాగ్‌పల్లిలో 140 కిలోల ఎండు గంజాయి తరలించే క్రమంలో ఇరువురు తప్పించుకున్నట్లుగా మల్లగొండ నేరం అంగీకరించడంతో, రిమాండ్‌కు తరలించామన్నారు. మిగతా వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

చిన్న ఆలయాలకు కొత్త కళ

ధూపదీప నైవేద్యాల సాయం పెంపు

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఒక్కో హామీని నెరవేర్చుతోంది. హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా ఆదాయం లేని ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాలకు సాయం పెంచారు. 2015లో తెదేపా హయాంలో రూ.2,500గా ఉన్న సాయం రూ.5 వేలు చేశారు. ఇప్పుడు ఈ సాయాన్ని రెట్టింపు చేస్తూ తొమ్మిదేళ్ల తర్వాత చంద్రబాబు ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంది. ఈ నెల నుంచి ఆలయాలకు నగదు అందనుంది.



జిల్లాలోని 15 మండలాల పరిధిలో 304 వరకు చిన్న, పెద్ద ఆలయాలు ఉన్నాయి. వీటిలో ఆదాయం లేనివి, వార్షికాదాయం రూ.50 వేలు లోపు ఉన్నవి వందల్లోనే ఉన్నాయి. ఆయా చోట్ల దాతలు కమిటీగా ఏర్పాటై అర్చకులను నియమించుకున్నారు. మరికొన్ని చోట్ల పండగలు, వార్షికోత్సవాల సమయంలో అర్చకులను నియమించి పూజలు చేస్తున్నారు. ఆలయాలకు శిఖర ప్రతిష్ఠ చేస్తే నిత్యం ధూప, దీప, నైవేద్యాలు పెట్టాలి. అయినా చాలా ఆలయాలు ఆ సౌకర్యాలకు నోచుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సాయం పెంచడంతో 195 కోవెలలకు మేలు చేకూరనుంది.



ఎంపికైన బాలగుడబలోని రామాలయం

జిల్లాలో ఎంపికైనవి	
నియోజకవర్గం	దేవాలయాలు
పార్వతీపురం	40
కురుపాం	71
పాలకొండ	70
సాలూరు	14

నిబంధనలు ఇవీ..

- ఆలయం 25 ఏళ్ల క్రితం నిర్మించి దేవదాయ శాఖ చట్ట పరిధిలో ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో పురాతన ఆలయాలకు ప్రాధాన్యం ఇస్తారు.
- 2.5 ఎకరాల్లోపు చిత్తడి లేదా 5 ఎకరాల్లోపు మెట్ట భూమి ఉండి ఏడాదికి రూ.30 వేలలోపు ఆదాయం సమకూరే వాటికి పథకం వర్తిస్తుంది.
- పూజారుల ఆధ్వర్యంలో నిత్య కైంకర్యాలు జరిగే గ్రామ దేవతల దేవాలయాలను పరిగణనలోకి తీసుకుంటారు.
- పెంచిన మొత్తం అర్చకుల ఖాతాకు చేరనుంది. పది వేలలో అర్చకులకు రూ.7 వేలు, ఖర్చులకు రూ.3 వేలు చొప్పున కేటాయించారు.

పక్కాగా కార్యక్రమాలు

దేవాలయాల్లో నిత్యం ధూప, దీప, నైవేద్యాల కార్యక్రమాలు పక్కాగా జరిగేలా చూస్తున్నాం. ప్రస్తుతం వీటికి అందిస్తున్న ఆర్థిక సాయం రెట్టింపు చేశారు. దీంతో చిన్న ఆలయాలకు మేలు జరుగుతుంది.
- రాజారావు, డీఈవో, పార్వతీపురం

మలుపు..ప్రమాదాలకు పిలుపు

మందస మండలం నారాయణపురం, బహాడపల్లి మధ్య రహదారిలో మలుపులు ప్రమాదాలకు హేతువులుగా మారాయి. పొదలు అల్లుకుని ఉండటంతో దగ్గరకు వచ్చే వరకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల 'మన పలాస-మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా కొన్ని రహదారుల వెంట పొదలు తొలగించారు. ఈ మార్గంలో బెర్మలు, మలుపుల వద్ద పొదల్ని రెండు రోజుల్లో తొలగించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ డి.దానయ్య తెలిపారు. **- న్యూస్‌టుడే, హరిపురం (మందస)**



అసంపూర్తి భవనం అక్కరకు వచ్చేనా?



మందస మండలం సువర్ణాపురం క్లస్టరుకు సంబంధించిన రైతు సేవా కేంద్రం నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. బిల్లులు మంజూరు కాక ఏడాది గడిచినా పనుల్లో పురోగతి లేదు. ప్రస్తుతం గ్రామంలోని పాఠశాల పాత భవనంలో రైతు సేవా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇరుకు గది.. పైకప్పు నుంచి వర్షపు నీరు కారుతుండటంతో ఎరువులు, విత్తనాలు నిల్వ చేసినప్పుడు రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో సూర్యనారాయణ తెలిపారు. **- న్యూస్‌టుడే, మందస**

లోయలోకి దూసుకెళ్లిన కారు.. డ్రైవర్ మృతి

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: కారు అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరొకరు గాయాలపాలయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం.. ఒడిశాలోని కోరాపుట్ జిల్లా బోయిపరిగుడకు చెందిన నలుగురు యువకులు గురువారం డుడుమ జలపాతం సందర్శనకు వెళ్తున్నారు. వనుగుమ్మ పంచాయతీ అసరాడ, తర్లాగుడ మధ్యలో కారు అదుపుతప్పి 20 అడుగుల లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఉమాశంకర్ బుయ్యా (35), మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు క్షతగాత్రులను బయటకు తీసి లమతపుట్టులోని ఆశాకిరణ్ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే ఉమాశంకర్ చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. సిద్ధాంత్ మహంతికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.



లోయలోకి దూసుకెళ్లిన కారు

సూరంపేటలో ఏనుగుల తిష్ఠ

సీతానగరం, న్యూస్‌టుడే: మండలంలోని సూరంపేట పరిసర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు తిష్ఠ వేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గుచ్చిమి, తాన్న సీతారాంపురం, సూరంపేట గ్రామాల పరిసరాల్లోని మామిడి, జీడి తోటల్లో తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. రాత్రి వేళ వరి పొలాల్లోకి వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. దూర ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.



మామిడితోటలో కరిరాజుల గుంపు

అతిథులారా మన్నించండి..!

పర్యాటకుల ప్రాధాన్యతా సందర్శన స్థలాల్లో తేలినీలాపురం విదేశీ పక్షుల విడిది కేంద్రానిది అగ్రస్థానం. జిల్లాకొచ్చే పర్యాటకులు, సందర్శకులు, ప్రకృతి, పక్షి ప్రేమికులకు ఇష్టమైన ప్రాంతం.. కానీ ప్రస్తుతం అక్కడికొచ్చి పరిస్థితులు చూస్తే నిరుత్సాహానికి గురవ్వక తప్పదు. గత ఐదేళ్లు గాలికొదిలేసి, ఉన్న వ్యవస్థలను నిర్వీర్యం చేసేసి అక్కడి వైభవాన్ని, ప్రాభవాన్ని గాడి తప్పించారు గత పాలకులు.. మళ్లీ పూర్వవైభవం రావాలంటే ప్రత్యేక దృష్టి సారించాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉంది.
- న్యూస్‌టుడే, టెక్కలి, టెక్కలి పట్టణం



పెయింటెడ్ స్టార్క్ పక్షులు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

పర్యాటక కేంద్రంలోకి వెళ్లే ప్రధాన గేటుకు తాళాలు వేసి మూసేశారు. మరుగుదొడ్ల నిర్వహణ లేక అధ్వానంగా మారాయి. పక్షుల జీవిత చరిత్రను తెలిపే వివరణ కేంద్రం పూర్తిగా మూతపడింది. చిన్న పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట సామగ్రి తుప్పుపట్టి మూలకు చేరింది. కేంద్రం వెనుక భాగం నుంచి ఆకతాయిలు చేరుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సందర్శకులు వెళ్లాలన్నా ఆ మార్గమే వినియోగించాల్సిన పరిస్థితి. జిల్లా మంత్రి అచ్చెన్న సొంత నియోజకవర్గం పర్యాటక కేంద్రం కావడంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కనీసం కన్నెత్తి చూడలేదు..

★ విదేశీ పక్షుల విడిది కేంద్రాన్ని గాలికొదిలేసిన గత ప్రభుత్వం

2014-19 మధ్య తేలినీలాపురం విదేశీ పక్షుల విడిది కేంద్రం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో అడుగులు పడ్డాయి. అప్పటి రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో కార్యాచరణ ప్రారంభమైంది. సైబీరియా నుంచి ఏటా అక్టోబరులో వచ్చే పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షులు ఇక్కడే పిండోత్పత్తి ప్రక్రియను నిర్వహిస్తాయి. వాటి కిలకిలా రావాలు, హొయలొలికించే విన్యాసాలను ఆస్వాదించేందుకు సందర్శకులు శీతాకాలమంతా ప్రత్యేక ఆసక్తి చూపిస్తారు. వరుసగా సెలవులు, పిక్నిక్‌లు, పర్వదినాలు, పండగలు ఉండటంతో ఈ సమయంలో పెద్దఎత్తున వస్తుంటారు. కేంద్రం అభివృద్ధిలో భాగంగా పగోడాలు నిర్మించారు. పక్షుల చరిత్రను తెలిపేలా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సందర్శకుల కోసం మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం సమకూర్చారు. ప్రాంగణాన్ని శుభ్రంగా తీర్చిదిద్దారు. అత్యాధునిక హంగులతో ముఖద్వారాలు ఏర్పాటుతో పాటు మరిన్ని సౌకర్యాల కల్పనకు ప్రతిపాదించారు. 2018లో వచ్చిన తిత్లీ తుపాను ధాటికి గ్రామంలో పక్షులు సేదతీరే చెట్లన్నీ నేలకొరిగాయి. ఆ సమయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఇనుప స్టాండ్లే నేటికీ దిక్కయ్యాయి. గత ఐదేళ్లలో కనీసం మొక్కలు నాటడం, పక్షుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోలేదు.



నిర్వహణకు నోచుకోని విడిది కేంద్రం




పక్షుల విడిది కేంద్రం ప్రధాన గేటుకు తాళాలు

రక్షణ చర్యలు చేపడతాం

తేలినీలాపురం విడిది కేంద్రానికి రక్షణ గోడ నిర్మాణం, ప్రధాన గేటు ఏర్పాటుకు రూ.12 లక్షలు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం. మరుగుదొడ్ల నిర్వహణకు నిధుల సమస్య ఉంది. పక్షుల చరిత్ర తెలిపే కేంద్రం తాళాలు తప్పనిసరిగా తెరిచి ఉంచేలా సిబ్బందికి సూచిస్తాం. ఇతర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.
- జగదీష్, అటవీశాఖ రేంజ్ అధికారి, టెక్కలి

వాల్మీకి గొప్ప మహర్షి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: తన కవిత్వంతో దేశాన్ని ఏకం చేసిన గొప్ప మహర్షి వాల్మీకి అని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీవరం పేర్కొన్నారు. గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు

ప్రాణం తీసిన రహదారి

అదుపుతప్పి కానిస్టేబుల్ మృత్యువాత



కె.బుల్లిబాబు (పాతచిత్రం)

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: అధ్వాన రహదారి.. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఓ పోలీసు కానిస్టేబుల్ నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. విధి నిర్వహణకు వెళ్తున్న కానిస్టేబుల్ రాళ్లు తేలిన మార్గంలో అదుపుతప్పి మృత్యువాత పడిన ఘటన కురుపాం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై నీలకంఠరావు వివరాల మేరకు.. పాలకొండ సమీపంలోని గొట్టమంగళపురానికి కె.బుల్లిబాబు (48) జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్సులో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ఈయన శ్రీకాకుళం జిల్లా హిరమండలంలోని నివాసం ఉంటున్నారు. గురువారం విధుల్లో భాగంగా గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఎల్విన్‌పేటకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. కురుపాం మండలంలోని జరడ- నీలకంఠాపురం ఘాట్ మార్గంలో అదుపుతప్పి పడిపోయారు. తల రహదారికి బలంగా తాకడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. మృతదేహాన్ని భద్రగిరి ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రతిపాదనలు పంపించినా..

కురుపాం మండలంలోని నీలకంఠాపురం నుంచి జరడ గ్రామానికి 9 కిలోమీటర్ల పొడవున రోడ్డు ఉంటుంది. ఏళ్ల క్రితం నిర్మించడంతో ప్రస్తుతం చాలా చోట్ల తారు ఊడిపోయింది. ఎక్కడికక్కడ కోతకు గురైంది. రాళ్లు తేలి అధ్వానంగా మారింది. ఇప్పటికే పలువురు ఈ మార్గంలో అదుపుతప్పి గాయాల పాలైన ఘటనలు నమోదయ్యాయి. ఈ ఏడాది మార్చిలో ఉపాధి పనుల్లో భాగంగా రహదారి నిర్మాణానికి రూ.4 కోట్లతో అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఐటీడీఏ జేఈ అప్పారావు తెలిపారు. అయినా మంజూరు కాలేదని ఆయన తెలియజేశారు.



నీలకంఠాపురం- జరడ ఘాట్ మార్గం

శునకం.. భయానకం!

● గ్రామాల్లో పెరుగుతున్న కుక్క కాటు బాధితులు

● నియంత్రణ చర్యలు శూన్యం



● చినడోకులపాడు నుంచి రేపల్లెకు ఓ మహిళ కుమార్తెతో వెళ్తుండగా ఆ మార్గంలో తిష్ఠ వేసిన కుక్కలు హఠాత్తుగా దాడి చేశాయి. చిన్నారి గౌను నోటితో పట్టి లాక్కెళ్తుండగా స్థానికులు అప్రమత్తమై రక్షించారు. ఈ ఘటనలో తల్లీకుమార్తెలకు గాయాలయ్యాయి.



● నువ్వలరేవులో ఓ వ్యక్తి నడుచుకుని వెళ్తుండగా కొన్ని శునకాలు వెంటపడ్డాయి. తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ కాళ్లపై కరిచి గాయపరిచాయి.



● అక్కుపల్లిలో ఓ మహిళ ఇంటికి నడుచుకుని వెళ్తుండగా గ్రామ సింహాల గుంపు వెనుక నుంచి వెంటపడింది. నోటితో చీరను వదలకుండా భయభ్రాంతులకు గురి చేసింది. స్థానికులు కేకలు వేయడంతో వదిలేసినా ఆమె కాలిపై కరిచేశాయి.



● చినడోకులపాడు కాలనీలోని ఓ పశువుల శాలలో నాలుగు మేకలు, రెండు ఆవులపై రాత్రి వేళ కుక్కల గుంపు దాడి చేయడంతో మృత్యువాత పడ్డాయి.



● పల్లిసారథి రహదారిలో ఓ వీఆర్వో ద్విచక్ర వాహనంపై కాశీబుగ్గ వైపు నుంచి వస్తుండగా శునకం వెంటపడింది. అదుపు తప్పి కింద పడటంతో గాయాలయ్యాయి.





● డోకులపాడు పంచాయతీ పరిధి సాగర్ కాలనీలో ఇటీవల ఒక మహిళ ఇంటికి వస్తుండగా ఓ గ్రామ సింహం ఆకస్మికంగా వచ్చి చేతి రెండు వేళ్లు కొరికింది. అవి నుజ్జవడంతో పలాస సామాజిక ఆసుపత్రికి తరలించారు. అదే రోజు మరో ముగ్గురిని గాయపరిచింది.

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతాల్లో శునకాల బెడద అధికంగా ఉంది. కుక్కల బారిన పడి గాయపడుతున్న బాధితుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఇళ్ల నుంచి బయటకు రావడానికి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రహదారులపై ఎక్కడికక్కడ పదుల సంఖ్యలో తిష్ఠ వేసి అటుగా వెళ్లే వారి వెంట పడుతున్నాయి. విద్యార్థులు బడులకు వెళ్లి వచ్చే సమయాల్లో భయంతో వణికిపోతున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని విమర్శలు వస్తున్నాయి.



డోకులపాడు వద్ద రహదారిపై కుక్కల గుంపు

● పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం, వజ్రపుకొత్తూరు, మందస, పలాస మండలాల పరిధిలో నెలకు సుమారు 50 నుంచి 80 మందికి పైగా కుక్క కాటుకు గురవుతున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది చిన్నారులు ఉంటున్నారు.

● వజ్రపుకొత్తూరు, డోకులపాడు, చినవంక, బైపల్లి, బాతుపురం, గుణుపల్లి, నగరంపల్లి, బెండి, పెద్దబొడ్డపాడు, పూండి-గోవిందపురం తదితర పంచాయతీల్లో గ్రామసింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి వేళ ఆయా గ్రామాల పరిధిలో ప్రయాణించే వారు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కుక్కలన్నీ ఒకచోట చేరి బిగ్గరగా అరుస్తూ ఆందోళనకు గురిచేస్తున్నాయి.

● మాంసం, చేపలు విక్రయ దుకాణాల నుంచి వచ్చిన వ్యర్థాలు, వివిధ కార్యక్రమాల్లో మిగులు ఆహారాన్ని కుప్పలుగా సమీప పరిసరాల్లో పడేస్తున్నారు. ఆయా ప్రదేశాల్లో కుక్కలు పెద్దఎత్తున తిష్ఠ వేస్తున్నాయి. ఆహారం తింటూ ఆ మార్గంలో వెళ్లే వారి వెంట పడుతున్నాయి. కొందరు తప్పించుకునే క్రమంలో కింద పడి గాయపడటంతో పాటు వాటి బారిన పడుతున్నారు.

టీకా వేస్తున్నాం..

పీహెచ్‌సీ పరిధిలో నెలకు సుమారు 20 మంది వరకు కుక్క కాటు బాధితులు వస్తున్నారు. అందరికీ టీకా అందిస్తున్నాం. రేబిస్‌పై గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. కుక్క కాటుకు గురైతే పీహెచ్‌సీని సంప్రదించాలి. **- విజయకుమార్‌రెడ్డి, వైద్యాధికారి, అక్కుపల్లి పీహెచ్‌సీ**

నియంత్రణకు చర్యలు తీసుకుంటాం..

గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉందని ఫిర్యాదులు అందుతున్నాయి. పశు వైద్యాధికారులతో సంప్రదించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పంచాయతీ కార్యదర్శులతో అవగాహన కల్పిస్తాం.
- రమేష్‌నాయుడు, ఎంపీడీవో, వజ్రపుకొత్తూరు

హెచ్ఐవీపై అవగాహన అవసరం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: హెచ్ఐవీ ఎయిడ్స్ బారిన పడిన వారు మందులు వాడేలా సిబ్బంది అవగాహన కల్పించాలని ఎయిడ్స్ నియంత్రణ సంస్థ క్లస్టర్ ప్రోగ్రాం ప్రబంధకుడు జి.ఆదిలింగం సూచించారు. గురువారం జిల్లా ఆసుపత్రిలోని ఏఆర్‌టీ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. అందరికీ సేవలు చేరువ చేసేందుకు కమ్యూనిటీ రిసోర్సు గ్రూపు ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి ఉన్న వారిని సభ్యులుగా చేర్చుతున్నామన్నారు. జిల్లా పర్యవేక్షకులు సాక్షిగోపాల్, కౌన్సిలర్ కృష్ణమూర్తి, ఏఆర్‌టీ సిబ్బంది, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న ఆదిలింగం

పల్లె పండగ.. అభివృద్ధి నిండుగా

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పల్లె పండగతో అభివృద్ధికి అడుగులు పడుతున్నామని ఎంపీడీవో సాల్మన్‌రాజు పేర్కొన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని జర్నలో సిమెంట్ రహదారి, కుసలో నీటి కుంట నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ★ బలిజిపేట: గళావల్లిలో మండల స్థాయి అధికారులు, తెదేపా నాయకులు డి.శ్రీను, టి.శ్రీనివాసరావు, జనార్దనరావు ఇంకుడు గుంతలు, అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు.

